క్లుప్తంగా

ఘనంగా శ్రీరామ అక్షింతల శోభాయాత్ర


అయోధ్య శ్రీరాముల పవిత్ర అక్షింతలతో శోభాయాత్ర చేస్తున్న దృశ్యం

హిందూపురం: అయోధ్యలో సీతారామచంద్రుల దివ్య మందిరం ప్రారంభం సందర్భంగా రామజన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్టు, వీహెచ్‌పీ ఆధ్వర్యంలో శ్రీరాముల పవిత్ర అక్షింతల శోభాయాత్ర పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక మేళాపురం వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద పూజలు నిర్వహించి, వాల్మీకి సర్కిల్‌లోని రామాలయం వరకూ మేళతాళాలతో ఊరేగింపు సాగింది. భక్తులు బిందెల్లో పవిత్ర అక్షింతలు పెట్టుకుని ఊరేగింపుగా సాగారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి గోసాయి హరిప్రసాద్, విభాగ విశేష సంపర్క్ ప్రముఖ్ చారుకీర్తి, నాయకులు రమేష్‌రెడ్డి, పార్థసారథి, వరప్రసాద్, ఆదర్ష్, భక్తులు, హిందూ సంఘాల నాయకులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

206 క్వింటాళ్ల రాగుల కొనుగోలు


ఆర్బీకేలో రాగులను పరిశీలిస్తున్న జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి అశ్వర్థ నారాయణ

అగళి: మండలంలోని పి.బ్యాడిగెర రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన రాగుల కొనుగోలు కేంద్రాన్ని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి అశ్వర్థ నారాయణ శుక్రవారం సందర్శించారు. మండల వ్యవసాయ అధికారి శేఖర్ నాయక్‌తో కలిసి రాగుల కొనుగోలుపై వ్యవసాయ శాఖ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మండలంలో ఇప్పటి వరకూ 206 క్వింటాళ్ల రాగులను కొనుగోలు చేశామని తెలిపారు. రైతులతో సంప్రదించి విరివిగా ప్రభుత్వానికే రాగులు అమ్మేలా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ అధికారి నవీన్ నాయక్, సీఈఓ భోజన్న తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ పాత్రికేయుడు రవూఫ్ సంతాప సభ


సీనియర్ పాత్రికేయుడికి నివాళులర్పిస్తున్న పాత్రికేయులు, ప్రజాసంఘాల నాయకులు

పెనుకొండ రూరల్: ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన సీనియర్ పాత్రికేయుడు, ఎస్.రవూఫ్ సంతాప సభను స్థానిక రహదారుల భవనాల విశ్రాంతి భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేశారు. సీనియర్ పాత్రికేయుడు రామకృష్ణ అధ్యక్షతన సభ జరిగింది. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నాగభూషణ బాబు, రామ్మోహన్ రెడ్డి, సీనియర్ పాత్రికేయులు శివప్రసాద్, ప్రకాశ్‌గౌడ్, కిరణ్‌స్వామి, భాను కిరణ్, బాబావలి, నరేష్, హరి, ప్రజా సంఘాల నాయకులు పెద్దన్న, రామాంజనేయులు, హరి, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సరిచూసుకోండి


మాట్లాడుతున్న ఎంపీపీ ఈరన్న

అమరాపురం: మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, బూత్ కన్వీనర్లు ఆయా గ్రామాల్లో కొత్తగా చేర్చిన ఓటరు జాబితాను సచివాలయాలకు వెళ్లి సరి చూసుకోవాలని ఎంపీపీ ఈరన్న, మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఈ విషయాన్ని గుర్తించుకుని రేపటిలోపు సరి చూసుకోవాలని సూచించారు. ముఖ్యంగా 18 సంవత్సరాలు నిండిన వారు కొత్తగా ఓటరుగా నమోదు చేసుకున్నవి, గ్రామంలో లేని ఓటర్ల వివరాలను చూసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క పాల్గొన్నారు.

రేపు కెంపేగౌడ జయంతి

అమరాపురం: మండల కేంద్రంలో ఈనెల 10వ తేదిన నిర్వహించే కెంపేగౌడ, బసమయ్య జయంతిని విజయవంతం చేయాలని కెంపేగౌడ, కుంచిటి వక్కలిగుల సంఘం సభ్యులు తెలిపారు. శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాల్లో తిరుగుతూ ముఖ్య నాయకులు, కుల బాంధవులను ఆహ్వానించారు. కార్యక్రమానికి కుంచిటి వక్కలిగులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు మంజునాథ, రాఘవేంద్ర, రంజిత్‌కుమార్, తిప్పేస్వామి, ఈరన్న, మల్లికార్జున, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే ప్రజా సంక్షేమం

- ఎమ్మెల్యే శంకరనారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర నారాయణ. చిత్రంలో ఎమ్మెల్సీ మంగమ్మ


కార్యక్రమానికి హాజరైన పార్టీ శ్రేణులు

గోరంట్ల: వైఎస్సార్‌సీపీతోనే ప్రజాసంక్షేమం సాధ్యమైందని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ తెలిపారు. మండలంలోని బూదిలి గ్రామంలో దాదాపు రూ.కోటితో నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ భవన సముదాయాన్ని గోరంట్ల మార్కెట్‌యార్డు చైర్మన్ బూదిలి వేణుగోపాల్‌రెడ్డి, సర్పంచ్ రామాంజనేయులుతో కలిసి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో అన్ని వర్గాల ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు సుదీర్ఘ పాదయాత్ర చేశారన్నారు. పేదల కష్టాలు కళ్లారా చూసిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి, అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని నవరత్న పథకాలు తీసుకొచ్చినట్లు తెలిపారు. పేదల సంక్షేమం కోసం 33 రకాల సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి, కులమత రాజకీయకతీతంగా వలంటీర్ వ్యవస్థ ద్వారా పేదల ముంగిటకే సంక్షేమ పథకాలను చేర్చినట్లు తెలిపారు.

పచ్చమీడియా సహకారంతో అసత్య ప్రచారం.

ప్రజా విశ్వాసం కోల్పోయిన చంద్రబాబునాయుడు, ఎలాగైన వచ్చే ఎన్నికల్లో గెలవాలనే పచ్చ మీడియా సహకారంతో ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేసున్నట్లు ఎమ్మెల్యే ఆరోపించారు. 2014 ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసం ఆచరణ సాధ్యం కాని వందలాది హామీలు ఇచ్చి, అధికారంలోకొచ్చిన తర్వాత గాలికొదిలేశారని అన్నారు. 2019 ఎన్నికల్లో పేదల అభ్యున్నతికోసం ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని పేదలు ఆశీర్వదించాలని కోరారు. ఎమ్మెల్సీ మంగమ్మ మాట్లాడుతూ 2014 ఎన్నికల సందర్భంగా రైతు రుణమాఫీ, డ్వాక్రా రుణాలు, బంగారు రుణాలు మాఫీ చేస్తామని మాయమాటలు చెప్పి ఓట్లు దండుకొని మోసం చేశారని గుర్తు చేశారు. చంద్ర బాబు రాజకీయ జీవతం ఎప్పుడూ మోసాలు, వెన్నుపోట్లతోనే సాగుతోందన్నారు. వైఎస్సార్‌సీపీతోనే పేదల అభివృద్ధి సాధ్యమయ్యిందని, పేదలు మరింత అభివృద్ధి చెందాలంటే మరోసారి ప్రజలు జగన్‌ను ముఖ్యమంత్రి చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ రంగనాయకులు, ఎంపీడీఓ రఘునాథగుప్త, జెడ్పీటీసీ సభ్యుడు పాలే జయరాంనాయక్, ఎంపీపీ ప్రమీల, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఫక్రుద్దీన్ సాహెబ్, జిల్లా సహకార బ్యాంక్ డైరెక్టర్ పాటూరి శంకరరెడ్డి, బూదిలి సహకార సంఘం అధ్యక్షుడు రఘు రామిరెడ్డి, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు డాక్టర్ బాషా, గోరంట్ల మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడు నూర్ మహమ్మద్, పెనుకొండ జెడ్పీటీసీ సభ్యుడు గుట్టూరు శ్రీరాములు, పార్టీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీ, పార్టీ ముఖ్య నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా కొల్లాపురమ్మ మండల పూజ


ఎమ్మెల్యే తిప్పేస్వామిని సన్మానించిన వాల్మీకి సంఘం నాయకులు

మడకశిర: పట్టణంలోని వాల్మీకి సర్కిల్‌లో వెలసిన కొల్లాపురమ్మ మండల పూజ శుక్రవారం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే తిప్పేస్వామి హోమంలో పాల్గొని కొల్లాపురమ్మకు ప్రత్యేక పూజలు చేయించారు. అంతకుముందు ఎమ్మెల్యేకు పట్టణానికి చెందిన వాల్మీకి సంఘం నాయకులు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు పుట్టకామప్ప, మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగభూషణ్‌రెడ్డి, నరేష్‌రెడ్డి, సతీష్, వాల్మీకి సంఘం నాయకులు మోహన్, ఈశ్వరప్ప, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం

లేపాక్షి: లేపాక్షి వీరభద్రస్వామి అన్నప్రసాదం సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదానానికి శుక్రవారం ఉదయం కోలారుకు చెందిన ఎం.స్వామి రూ.5 వేలు విరాళం కమిటీ సభ్యులకు అందజేశారు. దాతను కమిటీ సభ్యులు అభినందించారు.

వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీదే విజయం

- మరోసారి వైఎస్ జగన్ ముఖ్యమంత్రి కావడం తథ్యం
- సభను విజయవంతం చేసిన అందరికీ కృతజ్ఞతలు
- ఎమ్మెల్యే తిప్పేస్వామి



మడకశిర: మడకశిరలో గురువారం జరిగిన సామాజిక సాధికార బస్సుయాత్ర విజయవంతమైందని ఎమ్మెల్యే తిప్పేస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సుయాత్రకు నియోజకవర్గంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు పెద్ద ఎత్తున తరలివచ్చి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు మద్దతు పలికారని తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారనడానికి ఈ బస్సుయాత్రకు తరలివచ్చిన వేలాది మంది ప్రజలే నిదర్శనమని పేర్కొన్నారు. జన సునామీని చూస్తే వైఎస్ జగన్ మరోసారి ముఖ్యమంత్రి కావడం తథ్యమని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో 95 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలే ఉన్నారన్నారు. అన్ని మండలాల నుంచి బడుగు, బలహీన వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా ఈ బస్సుయాత్రకు తరలిరావడం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నాలుగున్నరేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలే వైఎస్సార్‌సీపీకి బలం అన్నారు. మహిళలు కూడా అధిక సంఖ్యలో పాల్గొనడం కూడా పార్టీకి శుభసూచకమని వెల్లడించారు. బస్సుయాత్రను విజయవంతం చేసిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కూడా పార్టీ శ్రేణులు ఇదే జోష్‌తో పని చేసి పార్టీని గెలిపించాలని కోరారు.

ఆస్పత్రికి బోన్ డ్రిల్లింగ్ మిషన్ వితరణ


బోన్ డ్రిలింగ్ మిషన్‌ను వైద్యులకు అందజేస్తున్న హుండాయ్ మోబీస్ సంస్థ ఏండీ

హిందూపురం టౌన్: స్థానిక ప్రభుత్వాస్పత్రికి హుండాయ్ మోబీస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సోషల్ కాంట్రిబ్యూషన్ కింద ఎలక్ట్రిక్ బోన్ డ్రిల్లింగ్ మిషన్‌ను శుక్రవారం వితరణగా అందించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని సెమినార్ హాలులో జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రోహిల్ కుమార్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. హుండాయ్ మోబీస్ ఎండీ కో క్యూంగ్ సీయోక్, హెచ్ఆర్‌జీఏ కోఆర్డినేటర్ జీఓంగ్ హేచియాంగ్ లీ, హూహ మిన్‌ఓ ముఖ్య అతిథులుగా పాల్గొని డ్రిల్లింగ్ మిషన్‌ను సూపరింటెండెంట్, ఆర్ఎంఓ రుక్మిణమ్మ, ఆర్థో డాక్టర్ డేవిడ్ రాజుకు అందజేశారు. వారు మాట్లాడుతూ దాదాపు రూ.2లక్షల విలువల గల ఎలక్ట్రిక్ బోన్ డ్రిల్లింగ్ మిషన్‌ను ఆస్పత్రికి అందజేయడం హర్షణీయమన్నారు. కలెక్టర్ అరుణ్‌బాబు చొరవతో హుండాయ్ మోబీస్ సంస్థ ముందుకు వచ్చి అందజేశారన్నారు. ఈ మిషన్ ద్వారా ప్రభుత్వ ఆస్పత్రిలోనే శస్త్ర చికిత్సలు చేయవచ్చన్నారు. సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ కలెక్టర్ సూచనలతో ముందుకు వచ్చి ఆస్పత్రికి మిషన్‌ను అందజేశామని, పేదల ప్రజలకు ఉపయోగపడే మిషన్‌ను వితరణ చేసే అవకాశం మాకు రావడంతో ఎంతో సంతోషమన్నారు. అనంతరం వారిని వైద్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలోఆర్ఎంఓ రుక్మిణమ్మ, వైద్యులు వెంకటరమణ నాయక్, డేవిడ్ రాజు, అన్నపూర్ణ, అయిషా, మంజునాథ్, చక్రధర్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

రొళ్ల: వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యాన్ని చేరుకోవాలని ఎస్ఐ మధురామచంద్రుడు పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం మండల పరిధిలోని రొళ్లకొండ సమీపంలోని జాతీయ రహదారిలోని టోల్‌గేట్ వద్ద వాహనదారులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించడంతో పాటు సీటు బెల్టు తప్పనిసరిగా పెట్టుకుని వాహనాలు నడపాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రికార్డులు సక్రమంగా లేని వాహనాలను గుర్తించి జరిమానా విధించినట్లు తెలిపారు.

రామాలయ నిర్మాణానికి భూమి పూజ

అగళి: మండల కేంద్రంలో రామాలయ నిర్మాణానికి శుక్రవారం దేవాలయ కమిటీ సభ్యులు, ఎండోమెంట్ అధికారులు భూమిపూజ చేశారు. ఇక్కడ ఉన్న ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన ఆలయ నిర్మాణానికి ఎండోమెంట్ అధికారులు దాదాపు రూ.కోటి నిధులను మంజూరు చేయడం జరిగిందని దేవాలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

మడకశిరలో మోస్తరు వర్షం

మడకశిరరూరల్: తుపాన్ ప్రభావంతో మండలంలో శుక్రవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. రబీలో పంటల సాగు చేయడానికి అనుకూలంగా మారిందని రైతులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా మహలక్ష్మి ఆలయ వార్షికోత్సవం


అమ్మవారికి జ్యోతులు తీసుకొచ్చిన మహిళలు

అగళి: మండల కేంద్రంలోని మహలక్ష్మి ఆలయ 14వ వార్షికోత్సవాన్ని శుక్రవారం సుబ్రహ్మణ్య శాస్త్రి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచే గణపతి పూజ, గంగ పూజ, కలశ పూజ, నవగ్రహ పూజ, పంచామృతాభిషేకం చేపట్టారు. మహలక్ష్మి అమ్మవారిని వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. మధ్యాహ్నం జ్యోతుల హారతి ఉత్సవాల అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అలాగే మహలక్ష్మి దేవాలయ నూతన సముదాయ భవనాన్ని ప్రారంభించారు.

మూడు ఆటోల సీజ్

సోమందేపల్లి: మండల కేంద్రంలో శనివారం మూడు ఆటోలను పోలీసులు సీజ్ చేశారు. పరిమితికి మించి వాహనాలు నడుపుతూ నిబంధనలు పాటించక పోవడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి



14వ వార్డులో మాట్లాడుతున్న హిందూపురం సమన్వయకర్త టీఎన్ దీపిక

హిందూపురం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు నిరుపేదలకు కొండంత అండగా నిలుస్తున్నాయని హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక అన్నారు. పట్టణ పరిధిలోని 14, 36 వార్డుల్లో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం కౌన్సిలర్లు, వైస్‌చైర్మన్ బలరామిరెడ్డి, వార్డు ఇన్‌చార్జి పామిశెట్టి నారాయణ, ఏబ్లాక్ కన్వీనర్ సాదిక్, జేసీఎస్ కన్వీనర్ శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. టీఎన్ దీపిక ముఖ్యఅతిథిగా హాజరై పార్టీ జెండా ఆవిష్కరించిన అనంతరం ఆయా వార్డుల్లో వైఎస్సార్‌సీపీ జగనన్న పాలనలో జరిగిన అభివృద్ధి, నవరత్నల పథకాలు ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించే బోర్డులను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమన్నారు. మోసకారి చంద్రబాబును నమ్మొద్దన్నారు. ఆయన బావమరిది బాలకృష్ణ నియోజకవర్గ ప్రజలను విస్మరించారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆదరించాలని కోరారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్‌చైర్మన్ బలరామిరెడ్డిలు ప్రసంగించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, కౌన్సిలర్లు జయప్ప, మల్లికార్జున, మణి, నాగేంద్రబాబు, గిరి, రోషన్, చంద్రశేఖర్, నాగేంద్రమ్మ, వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు మహేష్, చంద్రశేఖర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ శివశంకర్‌రెడ్డి, తిమ్మారెడ్డి, మస్తాన్, సాహేరబాను, కవిత, యార్డు డైరెక్టర్ ఫారూక్, రాము, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ పురుషోత్తమరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని టేకులోడులో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల నోటీస్ బోర్డును ఆవిష్కరించిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందజేయకుండా పేదలను మోసం చేసిందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఇంటికీ రూ.లక్షల్లో లబ్ధి చేకూర్చారన్నారు. ఆయనను మరోమారు సీఎంగా చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ ఈశ్వరయ్య, పార్టీ మండల కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీలు కవిత, రాఘవేంద్రరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ హనుమంతరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ శంకర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అభివృద్ధి సాధ్యమైందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, మాజీ కన్వీనర్ వెంకటరత్నం తెలిపారు. శుక్రవారం మండలంలోని తుంగోడు గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ పథకాల బోర్డుతోపాటు పార్టీ జెండా ఆవిష్కరించారు. రాత్రికి తుంగోడు గ్రామంలో పల్లె నిద్ర చేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ ఇమామ్ వలీ, స్థానిక నాయకులు శ్రీనివాస రెడ్డి, సూర్య ప్రతాప్ రెడ్డి, రమేష్, నూరి, వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

రొద్దం: మండలంలోని రెడ్డిపల్లి గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డు ప్రదర్శించారు. గ్రామంలో సచివాలయం వద్ద పార్టీ జెండా ఆవిష్కరించారు. ఎంపీపీ చంద్రశేఖర్ మాట్లాడుతూ మళ్లీ ఆంధ్రప్రదేశ్ జగనన్న ముఖ్యమంత్రి ఉంటేనే రాష్ట్రాభివృద్ధి చెందుతుందన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ఆంధ్ర ప్రదేశ్‌కు మళ్లీ సీఎం జగన్ అవసరమన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కురుబ రత్నమ్మ, వైస్ ఎంపీపీ రామాంజనమ్మ, జేసీఎస్ కన్వీనర్ ఆర్‌పి రవిశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్, ఈఓఆర్డీ కేశవరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


కిట్లు అందజేస్తున్న ఎంపీపీ పురుషోత్తమరెడ్డి


బుక్‌లెట్లు విడుదల చేస్తున్న దృశ్యం


రెడ్డిపల్లిలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

నీటి సరఫరాలో నేడు అంతరాయం

హిందూపురం: హిందూపురం మున్సిపాలిటీ పరిధిలో శనివారం పట్టణంలో తాగునీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నీటి పంపింగ్ కేంద్రమైన గొల్లపల్లి వద్ద ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతుకు గురయ్యారన్నారు. వాటిని మరమ్మతులు చేయించి 10వ తేదీ ఉదయం నుంచి నీటి సరఫరా పునరుద్ధరిస్తామరు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు

హిందూపురం: స్థానిక బాలాజీనగర్‌లోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం శనివారం వినాయక విష్వక్సేన, ఆంజనేయ, జయవిజయుల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తిరుపతి ఆగమ పండితుల ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో మూడురోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

క్రీడాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత


క్రీడా సామగ్రి అందజేస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్య, క్రీడల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత కల్పించి విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారని ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ సరోజమ్మ తెలిపారు. ఆడుదాం- ఆంధ్రా క్రీడా సంబరాల్లో భాగంగా ప్రభుత్వం గ్రామ సచివాలయాలకు సరఫరా చేసి క్రీడా పరికరాలను శుక్రవారం గ్రామ కార్యదర్శులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడా నైపుణ్యాలను వెలికితీయడానికి ఆడుదాం ఆంధ్రా టోర్నీ నిర్వహించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏఓ ఆరాధ్య, ఈఓఆర్డీ శైలజ, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సెబ్ విస్తృత దాడులు

హిందూపురం టౌన్: సెబ్ ఆధ్వర్యంలో శుక్రవారం పోలీసులు విస్తృత దాడులు చేపట్టారు. పట్టణంలోని శ్రీనివాసనగర్ వద్ద 30 మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని ఓ మహిళపై కేసు నమోదు చేసినట్లు సెబ్ సీఐ స్వర్ణలత తెలిపారు. అలాగే పరిగి మండలంలోని పెన్నానదిలో సురేషబాబు అనే వ్యక్తి ట్రాక్టర్ ద్వారా ఇసుకను తరలిస్తుండగా.. పట్టుకుని ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి, అతడిపై కేసు నమోదు చేశామన్నారు. కొటిపి రోడ్డులోని టిడ్కొ ఇళ్ల సమీపంలో అప్పలకుంటకు చెందిన మూర్తి అనే వ్యక్తి ట్రాక్టర్ ద్వారా ఇసుకను తరలిస్తుండగా దాడులు నిర్వహించి ట్రాక్టర్‌ను సీజ్ చేసి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు.

న్యాయవాదుల సంరక్షణ చట్టాన్ని అమలు చేయండి


ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

పావగడ: న్యాయవాదులపై మారణాంతక దాడులు, ప్రాణ బెదిరింపులు, హత్యలు ఇటీవల కాలంలో ఎక్కువ అవుతున్నాయి. తమకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం 'న్యాయవాదుల సంరక్షణ చట్టాన్ని' విధానసభ సమావేశాల్లో ప్రవేశపెట్టాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. శుక్రవారం తాలూకా కార్యాలయం వద్ద న్యాయవాదులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. కోర్టు నుంచి శనిమహాత్మ సర్కిల్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శేషనందన్ మాట్లాడుతూ.. న్యాయస్థానంలో అంతర్భాగమైన న్యాయవాదులు తమ కక్షిదారుల పరంగా నిర్భయంగా వాదించడానికి వీలులేకుండా పోతోందన్నారు. కొంత మంది ప్రత్యర్థులు తమపై ఒత్తిడి తెస్తూ తీవ్ర భయాందోళనలకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఈనెల 7న గుల్బర్గలో కోర్టుకు వెళ్తున్న న్యాయవాదిని పట్టపగలే దారుణంగా హత్య చేశారని తెలిపారు. అంతకు ముందు ఓ న్యాయవాది ని చిక్కమగళూరు పోలీస్ స్టేషన్ లో దూషించి అవమానించారన్నారు. ఈ నేపథ్యంలో న్యాయవాదులకు ప్రభుత్వం అండగా ఉండి రక్షణ కల్పించే బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు హనుమంతరాయ, శివకేశవరెడ్డి, వెంకటస్వామి, నరసింహ, ఆంజనేయ, జయసింహ, గౌసియా బాను, ఆసియా బాను తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

మడకశిరరూరల్: మండలంలోని ఆమిదాలగొంది పంచాయతీలోని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టామని సర్పంచ్ గీత తెలిపారు. శుక్రవారం టీడీపల్లి తండాలో వాటర్ స్కీమ్ మోటారుకు మరమ్మతులు చేయడం జరిగిందన్నారు. అనంతరం కుళాయిలకు నీటిని సరఫరా చేయించామన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా ముందు జాగ్రత్తగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

కార్తీక పూజలు

గుడిబండ: పట్టణ సమీపంలో ఉన్న తుమ్మల మారెమ్మ ఆలయంలో చివరి కార్తీక శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌ను వెండి, బంగారు ఆభరణాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

యువకుల శ్రమదానం

అమరాపురం: మండల కేంద్రంలోని శిర రోడ్డులో రోడ్డుకు ఇరువైపులా ఏపుగా సీమ తుమ్మ చెట్లు పెరగడంతో వాహనాల రాకపోకలు ఇబ్బందిగా ఉండేది. గమనించిన కెంపేగౌడ యూత్ అసోసియేషన్ సభ్యులు శ్రమదానం చేసి జేసీబీతో కంపచెట్లు తొలగించారు. పనులు పూర్తవడంతో వాహనదారులు సంతోషం వ్యక్తం చేశారు.